స్కెచ్

# ఇది ఎవరికి పరీక్ష?

"రత్నం"

మూర్తి కారు ఎక్కేడన్న మాటేగాని మనసు మనసులో లేదు. ఎవరూ దొరకనట్టు నూటయేభై మైళ్ళ దూరంలో 'వాచర్'గా వేసిన విద్యాశాఖవారి తెలివికి నవ్వాలో ఏడవాలో అర్థంగాలేదు అతనికి. అందులో నెల చివరిరోజులు. రెండునెలలకీ, మూడునెలలకీగాని జీతాలు అందని ఈ తాబేలునడక బోర్డు పాలనలో, కరువులో అధికమాసంలా ఇదో ఖర్చు! ఆ డబ్బయినా మళ్ళా యీ రోజుకు అందినా అందినట్టే! దారిబత్తేలకని ఓ పాతిక పిక్కేప్పటికి తాతలు దిగివచ్చారు. పెళ్ళాం పిల్లల్ని గాలికి వదిలి, ఏదయితే అదవుతుందని ప్రయాణమయ్యాడు చివరికి మూర్తి.

వేగం హెచ్చిన కారు వెనుక, చెట్టుచేమలు గబగబా జరిగిపోతున్నాయి. అపాయశంకతో గూడిన విచిత్రపుటూహాలు ... ఏదో భయం, ఆందోళన, కారువెనుక రేగిన ధూళిమేఘాల్లా, ఆవరించినయ్ మూర్తి మస్తిష్కంలో.

"ఈ పరీక్షలు మనకోసమే వచ్చినట్టున్నయ్! అరటాకూ—ముల్లూ సామెతేగా మనపని!" సానుభూతి వెల్లడించాడు మూర్తితోబాటు ప్రయాణం చేస్తున్న ఓ రిటైర్డ్ హెడ్మాష్టర్ సంగతంతావిని.

"మావాణ్ణి నెలరోజుల్నుంచీ చూస్తున్నా. ఎంతసేపటికీ కాపీలు తయారు చేసుకోటం తప్పితే పుస్తకం తెరవడే((! వాడితస్సాదియ్యా...సూది మొనంత అక్షరాలు...అంగుళం వెడల్పున బారెడు పొడుగు కాగితంచుట్ట తయారుచేశాడు. ఎక్కడ ఆపగలరు ఈ కాపీల్ని! ప్రపంచంతోపాటే మనం. ఏదో గుడ్డిలో మెల్లగా పోవాలి. మడికట్టుక్కూర్చుంటే చెడిపోయేది మనమేగా!" సుపుత్రుడి తెలివికి మురుసుకొంటూ చిన్న ఉపన్యాసం దంచాడు ఓ పెద్దమనిషి.

కారులో రైల్లో నలుగురూ కలిసిన చోటల్లా మార్చినెలా—జరుగుతున్న పరీక్షలూ ఇదే చర్చ. పోలీసు కాపలా మధ్య ఎంతో బందోబస్తుతో జరిగే ఆ పరీక్షా సంరంభంలో ఊపిరాడక మూర్తి లాంటివాళ్లు ఎంతమంది తన్నుకుంటున్నారో!

• • •

కాపలాగాస్తూ, అటూ యిటూపచార్లు చేస్తున్న మూర్తి, తన వెనుక జరిగే గారడీని గమనించక పోలేదు.

మోచేతిదాకా మడిచిన చొక్కా మడతలు ఒకటొకటే విడిపోతున్నయ్ కొందరికి. బూటులో అరికాలి క్రింద గులగుల మంటున్నది ఒకడికి. లాగు క్రింద మోకాలుపైన బిగుసుకు పోతున్నది మరొకడికి. బెల్టు క్రిందా...జేబుగుడ్డ సందుల్లో కొందరి వ్రేళ్ళు తడుముతున్నయ్. మూర్తి చూసినపుడల్లా ఏమీ ఎరగనట్టు అభినయిస్తున్నారు పిల్లిపాలు త్రాగేమాదిరి. వాళ్ళ అవస్థకు నిజంగానే నవ్వొచ్చింది మూర్తికి.

మూర్తి వెనక్కు తిరిగితే చాలు, ఎక్కడెక్కడికో పోయిన ఎడంచేతులు బల్లమీదికి వచ్చేవి. గుప్పిళ్లుకొన్ని గట్టిగా మూసి ఉండేవి. అన్సర్ పుస్తకం పేజీ తిరిగినపుడల్లా ఏవో నీడలు కాగితాల మధ్య పాప జూసుకొంటూ కన్పించేవి.

ఉండజుట్టిన ఓ కాయితం కిటికీగుండా లోపలికి పడింది — చిరునవ్వుతో ముందుకు సాగారేదు డ్యూటీ చెలాయిస్తున్న ఓ పోలీసు.

పంచి నీళ్ళు ఇచ్చినట్టే ఇచ్చి ఏదో జారవిడిచాడు ఆ కుర్రాడి వళ్ళో స్కూలు ప్యూను.

కాగితాలు జుట్టిన రాళ్ళకు అంతేలేదు. రంయ్ రంయ్యిన వచ్చి పడుతున్నయ్.

పళ్ళపాడి గొట్టాల్లో దగ్గరి యింట్లోంచి అన్సర్‌ని ఎవరో బ్రాడ్‌కాస్టు చేస్తున్నారు.

అవి పరీక్షలయిన మాట నిజమే! సంవత్సరాల శ్రమ రంగంలోకి రావాలి. మెదడులో జీర్ణించిన ఎన్నోవిషయాలు ఎంతో విజ్ఞానం, క్రమపద్ధతిలో పరిమిత కాలంలో పొర్లి పొర్లి కలం పాళీగుండా ప్రవహించాలి. కాని ప్రశాంతంగా పరిశుద్ధంగా

జరగాల్సిన ఆ పరీక్షలు రోజురోజుకీ అశాంతికీ మోసానికీ ఆలవాలం అవుతున్నాయి. ఆ దుస్థితి తొలిగేది ఎప్పుడోగాని అప్పటిదాకా మూర్తి లాంటి వాళ్ళపని ముందు నుయ్యి, వెనక గొయ్యి!

• • •

యుద్ధం మధ్యలో విశ్రాంతితీసుకొనే సైనికుడు తలపులోకి వచ్చాడు మూర్తికి ఆ ఆదివారం రోజున. ఇంకొక్కరోజు గడిస్తే చాలు, బ్రతికి ఆయటపడినట్టే! తెచ్చుకొన్న జత ఇస్త్రీ గుడ్డలూ వెనకవైపు అప్పుడే సిరాచినుకుల్తో నిండిపోయినయ్. ఏమీ తోచక లాల్చీ రెండుజేబుల్లోంచి ఇంత పొత్తి బయటికి లాగేడు. అవన్నీ పిల్లలదగ్గర్నుంచి తీసికొన్న కాపీ కాగితాలు.

ఇంగ్లీషు, హిందీ, తెలుగు-అన్ని భాషలవీ. అన్ని విషయాలవీ ఉన్నవి వాటిల్లో. కాపీలు తయారు చేసుకోవటానికి పిల్లలు పడిన శ్రమ, చూపిన నైపుణ్యం చూస్తే వాళ్ళేమంత తెలివితక్కువ వాళ్లు కాదని తోచింది మూర్తికి. కాని ఆ అప మార్గాల్ని తమ స్వార్థానికీ వాడుకొనే ద్రోహుల మీద తగని కోపం, అసహ్యం కలిగింది అతనికి.

గైడుల్లోనుంచి చింపిన కాగితాలన్నీ కాపీల కోసమే అన్నట్టు, కవి విషయాలన్నీ ఓ ప్రక్క కంఠస్థాలన్నీ మరోప్రక్క, అర్థాలన్నీ ఓ ప్రక్క గ్రామరంతా మరోప్రక్క రెండు తావులు కలిపిన సైజులో ముద్రించి ఉన్నయ్. తమ లాభాలకు విద్యారంగాన్ని ఉపయోగించుకొంటున్న ఆ నీచత్వం ఏ గైడు తిరగేసినా కళ్ళకు కట్టినట్టు కన్పిస్తుంది.

అదొక ఎడిషనల్ పేపరు. దొంగచాటుగా మిగుల్చుకొని ఇంటిదగ్గరే జవాబులు వ్రాసుకొచ్చాడు, వస్తాయనుకొన్న ప్రశ్నలన్నిటికీ ఆ కుర్రాడు. తను ఊహించినట్టు ప్రశ్న లేకపోయేసరికి, ఈ మూలనించి ఆ మూలకు గీతలుపెట్టి ముందే ఇచ్చేశాడు మూర్తిచేతికి. వ్రాసుకొచ్చిన ఆ జవాబుల్లోనే మరోరూపంలో సమాధానం ఉన్నదని తెలీదు పాపం మూడోసంవత్సరం హాజరయిన ఆ విద్యార్థికి.

అన్నిటికంటె ఆ కాగితం చరిత్ర గమ్మత్తయింది. 'మాష్టారూ! ఏ వూరండీ మనది?'—అన్నాడు మొదట. కాఫీలు ఉప్మాలు యిప్పించాడు ఘరానాగా అందరితోపాటు. వాళ్ళ కొబ్బరితోటకు తీసుకెళ్ళి వడగాడుపునకు ఉపశాంతిగా చల్లని... తియ్యని నారికేళ తీర్థాన్ని యిప్పించాడు. ఇంతకీ అతడు ఆ స్కూల్లో సైన్సు పంతులు. ఓ రోజున మూర్తి వాచర్‌గా ఉన్న గదిదాకా వచ్చి, ఓ కాగితం మూర్తివైపు విసిరాడు ఫలానా నంబరుకు ఇవ్వమని. జరిపిన ఆతిథ్యం స్వార్థానికా! అనుకున్నాడు లోలోపల. కాగితంమడిచి జేబులోపెట్టుకొని ఆ నంబరును మెసలనీయకుండా అతి జాగ్రత్తగానే చూశాడు ఆ రోజు! ఇప్పుడా పంతులు ఎదురుబడితే పలకరించడు మూర్తిని. మొఖం మాడ్చుకొని తప్పించుకు తిరుగుతాడు.

ఆది డిపార్టుమెంటల్ ఆఫీసరు దాచమని ఇచ్చిన కాగితాల కట్ట. అన్నిటిమీదా, నంబర్లు వేసి ఉన్నయ్. అరగంటదాకా చూశాడట... వాచర్ కుర్చీలో బడి గుర్రుకొడుతున్నాడట!... పిల్లలందరిదగ్గరా కాపీలు లాక్కొని, ఇక సహించలేక నిద్రలేపితే 'సారీ, రాత్రి సినిమాకి వెళ్ళా'నని సంజాయిషీ చెప్పుకున్నాట్ట! ప్చ్...! అని పెదవి విరిచాడు అందరిమీదా కాపలాకి వచ్చిన ఆ ఆఫీసరు మూర్తిదగ్గరకు వచ్చి.

• • •

తనతో పాటు కారులో వస్తున్న సైన్సు పంతుల్నీ, అతనిదగ్గరే కూర్చున్న కుర్ర గ్యాంగునీ చూచి, సినీమాకి కాబోలు అనుకున్నాడు మూర్తి.

కాని వాళ్ళ మాట్లాడే తీరూ, ఆ వ్యాఖ్యానాలు వింటుంటే ఏదో ప్రళయం ముంచుకొస్తున్నట్టు ఊహించాడు.

మొగాడు బయల్దేరేడు కాపీలు పట్టుకోటానికి! గాలికి ఊగే పొడుగాటి కుర్రాడు ఉరిమి చూశాడు మూర్తివైపు.

అమ్మ, ఆలి బూతులు మొదలెట్టేడు శ్రుతిగా ఓ మొద్దు నాలుక అతను.

ఒళ్లు చెడుతుందట, రక్తం కళ్ళ జూస్తారట! బులపాటం వదులుతుందట! సైన్సు పంతులి కోర చూపులు మూర్తిని ఇంకా కంపితుణ్ణి చేసినయ్.

“విజయమా? వీరస్వర్గమా!” కారు దిగి ఊళ్ళోకి వస్తున్న మూర్తిని కుతూహలం కొద్దీ అడిగేడు ఓ తోటి పంతులు.

తలగుడ్డ విప్పి కట్టు చూపించాడు సమాధానంగా మూర్తి. ★